సంచలన సాయంకాల పత్రిక
# సత్యం



## ఆడాళ్లూ.. మీకు జోహార్లు!

శ్రీ వారాహి సిల్క్స్

కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు,
శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 8-3-2025

సంపుటి: 20 సంచిక: 293

పేజీలు: 8 వెల: రూ.1


# కత్తికట్టిన వ్యవస్థ ఒంపు తీర్చిన 'సరళ'రేఖ



ఉరిటి సరళ

- ఒంటరిపోరు సలిపిన ధీశాలి
- కుమార్తె మరణం, కొడుకు జైలుపాలు
- అయినా వ్యవస్థపై ఆపని యుద్ధం
- కొలిక్కి వచ్చిన గార కేసు పునఃవిచారణ
- మహిళా దినోత్సవం రోజున ప్రస్తావించుకోవాల్సిన కథనం



"చిక్కుముడుల వెంట పరుగెత్తుతున్నప్పుడు సరళరేఖ సాక్షాత్కరిస్తుంది. కర్రపేడు కూడా ఒకప్పుడు వృక్షమే. దానికో పచ్చటి కల ఉంటుంది. కల ఉన్నప్పుడు దాన్ని నరికేసే గొడ్డలి కూడా ఉంటుంది. దానికి కూడా కర్రే ఆసరా. జీవితం ఒక సుదీర్ఘ ప్రయాణం. టిక్కెట్ అడగరు. ఎక్కడాపేస్తారో తెలియదు. నడిచినంత కాలం నడవాలి. శిఖరం ఉందనుకుంటే లోయ కనిపిస్తుంది. లోయల్లోకి జారిపోతున్నప్పుడు ఎక్కడి నుంచో చేయూత దొరుకుతుంది. ఇప్పుడు చదవబోయే కథనం సారాంశం నాలుగు ముక్కల్లో చెప్పాలంటే ఇంతే. తమకు అన్యాయం జరిగిందని పోలీసుల వద్దకు వెళితే.. ఆ పోలీసులే నేరం మోపి జైలుకు పంపారు. మీ వద్ద పని చేస్తూ తన కుమార్తె ప్రాణాలు తీసుకుందంటూ బ్యాంకు అధికారులకు మొరపెట్టుకుంటే వారే ప్రాణాలు తోడేశారని తెలుసుకున్న తర్వాత ఆ మహిళ ఏం చేసింది? ఆమె పోరాటం బ్యాంకు చరిత్రలోనే ఎందుకు నిలిచిపోయింది? తెలుసుకోవాలంటే ఈ కథనం చదవండి."



స్వప్నప్రియ (ఫైల్‌ఫోటో)

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు ఉరిటి సరళ. జీవితాంతం తోడుంటానని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన భర్తను భగవంతుడు మధ్యలోనే తీసుకుపోయినా, తన ఇద్దరు పిల్లలను ప్రయోజకులను చేసింది. ఊరిలో ఉన్న పొలం పోరంబోకుగా మారకుండా గ్రామస్తులతో కౌలు చేయించుకుంది. ఒక ఒంటరి మహిళ ఒకవైపు తన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం, మరోవైపు పిల్లలను ప్రయోజకులను చేయడం వల్ల మహిళా దినోత్సవం సందర్భంగా అందిస్తున్న కథనం కాదు ఇది. వ్యవస్థ, రాజ్యం చేతులు కలిపి ఒక కుటుంబాన్ని పాతాళంలోకి తొక్కేసినా.. ధర్మం తమతో ఉంటే మొలకెత్తుతామని నమ్మి పోరాటం చేసిన ఓ ధీశాలి కథే ఇది. ఉద్యోగం చేస్తున్న కుమార్తె ఆత్మహత్య చేసుకొని అర్ధాంతరంగా తనువు చాలించినా, ఆ సమయంలో అండగా ఉండాల్సిన కుమారుడ్ని ఇక్కడి వ్యవస్థ దొంగగా ముద్రవేసి జైలుకు పంపినా తన కుటుంబం ఏ తప్పు చేయలేదని, తమకు న్యాయం చేయాలంటూ ఉరిటి సరళ చేస్తున్న పోరాటం మరి కొందరిలో స్ఫూర్తి నింపుతుందన్న కోణంలోనే ఈ కథనాన్ని అందిస్తున్నాం.

జిల్లాలో గార ఎస్‌బీఐ బ్రాంచిలో జరిగిన తాకట్టు నగల మాయం కేసును జిల్లా ప్రజలకు కొత్తగా చెప్పక్కర్లేదు. ఈ బ్రాంచిలో ఖాతాదారులు కుదువ పెట్టిన బంగారాన్ని అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న స్వప్నప్రియే దొంగిలించిందని పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు ఎటువంటి ప్రాథమిక విచారణ చేయకుండా ఆమెను మొదటి ముద్దాయిగా చేర్చడం, స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకోవడం అందరికీ తెలిసిందే. తాజాగా ఈ కేసులో ప్రైవేటు బ్యాంకుల నుంచి తాకట్టులో ఉన్న ఎస్‌బీఐ బంగారాన్ని పోలీసులు విడిపించారు. వీటిని ఖాతా దారులకు అప్పగించాలంటూ గత నెల 27న కోర్టు ఆదేశాలిచ్చింది. ఎవరైతే తమ బంగారాలు విడిపించుకోవాలనుకుంటున్నారో వారందరికీ వీటిని ఇచ్చేస్తున్నారు. దీంతో గార బ్రాంచిలో తాకట్టు పెట్టిన బంగారం పోయిందని గగ్గోలుపెట్టిన ఖాతాదారులందరూ సేఫ్. ఇక గార ఎస్‌బీఐ లాకర్‌లో ఉండాల్సిన బంగారం జిల్లాలో పలు ప్రైవేటు బ్యాంకుల నుంచి పోలీసులు రికవరీ చేయడంతో ఈ ప్రైవేటు బ్యాంకులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకున్నట్లు భోగట్టా. దీంతో - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ఏలినవారి లీలా విన్యాసాలు..

ఎన్నికల్లో గెలుపు కోసం రాజకీయ పార్టీలు ఉచితంగా తాయిలాలు ఎరచూపుతుండంపై ఓవైపు చర్చ జరుగుతుండగా, ప్రజల్లో అడుక్కునే అలవాటు పెరుగుతోందని మధ్యప్రదేశ్ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలంటే ఎంత చులకనభావమో ఆయన మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. నయా ఉదారవాద విధానాలు అంతిమ దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఏలినవారి లీలావిన్యాసాలివి. తమ యజమానులైన కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం, అసంఖ్యాకులైన పేదల నోటికాడి కూడు లాగేసుకునే కుతంత్రాలివి. 'ప్రభుత్వాన్ని అడుక్కోవడం ప్రజలకు అలవాటుగా మారింది. స్టేజి మీద మెడలో దండేసి, చేతిలో అర్జీ పెట్టడం పరిపాటిగా మారిపోయింది. ఇది మంచి అలవాటు కాదు. అడగడానికి బదులు.. ఇవ్వడం నేర్చుకోండి. అప్పుడు జీవితం ఆనందంగా ఉండడంతో పాటు మంచి సమాజం సొసైటీ నిర్మితమవుతుంది' అని హితోక్తులు పలికారు. 'ఉచితాలపై ఎక్కువగా ఆధారపడకూడదని, అలా చేస్తే సమాజం బలహీనపడుతుంది' అని మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇది సంక్షేమ రాజ్యమన్న మౌలిక సూత్రాన్నే మరిచి, అదే దేశాభివృద్ధికి ఆటంకమనడంలోని ఉద్దేశమేమిటి? నిజంగా పేదలకిచ్చే ఈ అరకొర సంక్షేమమే ఆర్థికవ్యవస్థకు భారంగా మారిందా? మరి రాయితీలు, ప్రోత్సాహకాల పేరుతో పెద్దలకిచ్చే కానుకల మాటేమిటి? ఇప్పటికే పేదలకందుతున్న అరకొర సంక్షేమ పథకాలకు భారీగా కోతలు పడుతున్నాయి. ఇప్పుడు ఉచితానుచితాల గురించి చర్చ లేపి ఏకంగా వాటిని రద్దుకే సిద్ధమయ్యారు వీరు. అయినా ఈ ప్రభుత్వాలు పెద్దలకిచ్చే ఉచితాలతో పోలిస్తే పేదలకిచ్చే ఉచితాలు ఏపాటివి? ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మాని, అజీర్తితో ఉన్నవారికి కుక్కి కుక్కి తినిపించడాన్ని ఏమనాలి? ఇలాంటి విధానాల ఫలితమే కదా అసంఖ్యాకుల అర్థాకలి జీవితాలు? వ్యవసాయ సంక్షోభం నానాటికి తీవ్రమై కోట్లాది మంది ఆ రంగాన్ని వదిలేస్తున్నారు. యువతకు కొత్త ఉద్యోగాలు లేవు. ఉన్న అరకొర ఉపాధిలో భద్రత లేదు. ఈ పరిస్థితుల్లో, ఇప్పటికే అడ్డూ అదుపూ లేకుండా పెరిగిన ధరలతో జనం అల్లాడుతుంటే.. నిత్యావసరాలకు తోడు, శ్మశానంలో కర్మకాండలపై కూడా జీఎస్టీ విధించి పేదల ఉసురు తీస్తున్న ఘనత ఈ పెద్దలదే కదా. ఏలినవారు మోపుతున్న ఈ భారాల ముందు వీరికిచ్చే ఉచితాలు ఏపాటివి? 'ఈ బిచ్చగాళ్ల సైన్యం సమాజాన్ని బలోపేతం చేయడంలేదు.. బలహీన పరుస్తున్నది. ఉచితాలకు ఆకర్షితులవడం.. అమరులకు ఇచ్చే గౌరవం కాదు. వాళ్ల సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవడమే వాళ్లకు ఇచ్చే నిజమైన గౌరవం. అమరులు ఎవరైనా అడుక్కున్నట్టు చరిత్రలో ఉందా?' అని ప్రశ్నించారు. ఆయన చెప్పిన అమరులెవరూ ప్రజలను బిచ్చగాళ్లుగా చూడలేదు. 'నర్మదా పరిక్రమ యాత్రికుడిగా నేను దానం అడిగాను. కానీ నాకోసం ఎప్పుడూ ఏదీ ఎవరినీ అడగలేదు. నాకు ఏదైనా ఇచ్చానని ఎవరూ చెప్పలేరు' అంటూ తన సచ్ఛీలత నిరూపించుకునే ప్రయత్నం చేశారు. సంక్షేమపథకాలను అడ్డుపెట్టుకుని అధికారంలోకి రావాలన్న యావే తప్ప, ఈ ఉచితాల వల్ల ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుందన్న ధ్యాసే ప్రతిపక్షాలకు లేదని సాక్షాత్తు ప్రధానమంత్రే శెలవిచ్చారు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయడమేనని వాపోయారు. (ఆ చెల్లింపుదారులు ప్రజలేనన్న సంగతి మరిచిపోయారు) ఇవన్నీ పలుకుతున్నది ప్రధానీ, పాలకపార్టీ నేతలే అయినా.. పలికిస్తున్నది మాత్రం కార్పొరేట్లేనన్నది విజ్ఞుల మాట. ఇవాళ పాలకులే ప్రజలను బిచ్చగాళ్లుగా, తాము దానగుణ సంపన్నులుగా భావిస్తున్నారు. అందుకే సంక్షేమ కార్యక్రమాల్ని తమ ఔదార్యంగా ప్రకటించుకుంటున్నారు. ఇది ఉదారత కాదు, ప్రభుత్వ బాధ్యత. ప్రజలు కట్టే పన్నులతో ప్రజల సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయడం పాలకుల కర్తవ్యం. అధికారంలో ఉన్నవారు తమ జేబులోంచి ఖర్చు పెట్టడంలేదు. జనం డబ్బునే వెచ్చిస్తున్నారు. అయినప్పటికీ ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు పెంచడం, కళాశాలలు, ఆస్పత్రులు స్థాపించడం, పెన్షన్లు మంజూరుచేయడం, రేషన్ సరుకులు సరఫరా చేయడం తమ దానగుణశీలానికి, ఉదారబుద్ధికి సంకేతంగా చెప్పుకుంటున్నారు. ప్రజల డబ్బుతో చేపట్టే పథకాలకు తమ పేరు పెట్టుకొని అపర దానకర్ణులుగా గొప్పలకు పోతున్నారు. వ్యక్తులే గాక ప్రభుత్వాలు సైతం దానం చేస్తున్నట్టుగా మాట్లాడటం, వ్యవహరించడం విదూషకత్వం. 'ఓట్ల కోసం ప్రజలను అడుక్కోవడానికి త్వరలో వాళ్లే వస్తారు' అన్న సంగతి ఇప్పుడు ప్రజలు గుర్తుంచుకోవాలి.

## మిస్సింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అపరిష్కృతంగా ఉన్న అదృశ్య (మిస్సింగ్) కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తులో పురోగతి సాధించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నుంచి జూమ్ కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న డిఎస్పీ, సీఐ, ఎస్సైలతో మిస్సింగ్, రోడ్డు ప్రమాదాల కేసులు దర్యాప్తు, విచారణ, హిట్ అండ్ రన్ కేసుల దర్యాప్తు ప్రస్తుత స్థితి, కేసులో సాధించిన పురోగతి తదితర అంశాలపై అదనపు జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ కేవీ రమణతో కలసి సమీక్షించారు. ఈ క్రమంలో ముందుగా పెండింగ్ మిస్సింగ్ కేసుల వివరాలను స్టేషను వారీగా ఆరా తీసి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. దర్యాప్తు పూర్తయిన ప్రతి కేసు వివరాలను సీసీటిఎన్ఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తప్పిపోయిన వ్యక్తులను గుర్తించేందుకు అన్నివిధాల పూర్తి స్థాయి ప్రయత్నం చేయాలన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిగత వివరాలు పరిశీలించి ఎక్కడున్నారనే విషయాన్ని గుర్తించి ఆ చోటుకు పోలీసు బృందాలు పంపించి కేసులను ఛేధించాలని సూచించారు. సాంకేతిక ఆధారాల ద్వారా కూడా వ్యక్తులు సమాచారం తెలుసుకొని కేసులు పరిష్కరించాలన్నారు. తప్పిపోయిన బాలికలు, మహిళ, పురుషులు మిస్సింగ్ కేసులను ప్రాధాన్యత ఇస్తూ అన్ని కోణాలలో దర్యాప్తు చేసి సదురు కేసులను వీలైనంత మేరకు ఛేదించి తల్లిదండ్రులకు బాధిత మహిళలను అప్పగించాలని జిల్లా ఎస్పీ సూచించారు. పెండింగ్ లో ఉన్న రోడ్డు ప్రమాదాల కేసులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు నష్టపరిహారాన్ని త్వరితగతిన అందేలా పోలీసు సైడ్ నుంచి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు వారి వారి పోలీసు స్టేషను, కార్యాలయాలు నుంచి పాల్గొన్నారు.

## మహిళ సాధికారతే లక్ష్యంగా సాగిన అవగాహన ర్యాలీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళ సాధికారతే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సాగిన అవగాహన ర్యాలీ. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి మహిళ పోలీసులు, మహిళ పోలీసు సిబ్బందితో అదనపు ఎస్పీ కెవి రమణ ఆధ్వర్యంలో ర్యాలీ డే అండ్ నైట్ కూడలి వరకు సాగి మానవహారంగా ఏర్పడి మహిళా సాధికారత, చైతన్యం, ప్రగతి తదితర అంశాలపై జై జై పలికారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినిలు, గ్రామీణస్త్రీలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషను పరిధిలో వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్, చిత్రలేఖనం, ఓపెన్‌హౌస్ వంటి కార్యక్రమాలు నిర్వహించి మహిళా చట్టాలు, పోలీసు దైనందిన కార్యక్రమాలలో విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రతి మహిళ పోలీసు ఉద్యోగికి మహిళ పోలీసులకు ఉచిత మెగా వైద్య శిబిరాలు ద్వారా వైద్యపరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలు చిన్నారులు భద్రతకు జిల్లా పోలీసు యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు సిహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, పైడపునాయుడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఎస్సైలు హరికృష్ణ జనార్ధన్, రాము, సందీప్, ప్రవలిక, లక్ష్మి మహిళా పోలీసులు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళిక ఉంటేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లక్ష్యం ఉంటేనే గమ్యానికి చేరుకోవచ్చునని పలువురు జిల్లా అధికారులు, విద్యావేత్తలు, వైద్యులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ), శ్రీ ప్రగతి మహిళా మండలి కుటుంబ సలహా కేంద్రం, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'విద్య, వైద్యం..భవిష్యత్తు ప్రణాళిక' అనే అంశంపై స్థానిక మహిళా కళాశాల ఆడిటోరియంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. శక్తి అధ్యక్షురాలు పైడి రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లాలోని మహిళా అధికారులు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వి.ఎన్.ఎన్.ఎల్.ప్రసన్న, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అనురాధ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచి క్రమశిక్షణతో ముందుకు సాగాలని, లక్ష్యానికి తగ్గట్టుగా పనిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకరనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ పోటీపరీక్షల్లో రాణించేవిధంగా విద్యార్థులను తమ చదువులు కొనసాగించాలన్నారు. రహదారి భద్రత గూర్చి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గంగాధర్, అమృతకుమారి, శిరీష వివరించారు. వివిధరంగాల్లో సేవలందించిన మహిళలకు ఉమాదేవి సేవా పురస్కారాలు శక్తి, ప్రగతి అధ్యక్షురాలు పైడి రజని, కోట సావిత్రమ్మ అందించి సత్కరించారు. కార్యక్రమంలో భారతీయ నృత్యం నాగకన్యక శ్రీనివాస్, పరిమిళ హరిహర్, సంధ్యా చందన, స్నేహాంజలి, వర్షిత, న్యాయవాది తేజోమూర్తుల ఉమాదేవి, ఫ్యామిలీ కౌన్సిలర్ కోట సరోజ, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.మాధురి, డెంటల్ సర్జన్ డాక్టర్ తంగి సౌజన్య, డాక్టర్ వినీల, విద్యారంగం నుంచి డోకల యశోద, సాయి శ్వేత, లలితారెడ్డి, తిరుమల రాణి, మేడపాటి అనిత, బెందాళం వరలక్ష్మి, శ్రావణి, ఫాతిమా బేగం, మహిళా పోలీస్ ఫర్వీనాబేగం, డెల్అండం సంస్థ ట్రాన్సలేటర్ ఉప్పలపాటి నిర్మజ, ట్రిపుల్ ఐటీ మ్యూజిక్ లెక్చరర్ యామినీ కృష్ణ, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు తమ్మినేని ఉషారాణి, మణిశర్మ, కిల్లి మాధవి, టైలర్ అలుగోలు లక్ష్మీగరత్నం, గృహిణి తేజేస్విలను సత్కరించారు. శ్రీనివాసరాజు ఇంద్రజాల ప్రదర్శన, స్నేహాంజలి నాట్య ప్రదర్శన అలరించింది.






# నో ఫన్!

**ఓవైపు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వెలుగొందుతూ.. ఇంకోవైపు నటుడిగానూ గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తుంటాడు జి.వి.ప్రకాష్ కుమార్. అతను నటించిన కొత్త చిత్రం 'కింగ్‌స్టన్' ఈ రోజే తమిళ-తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం.**

**కథ:** కింగ్ స్టన్ (జి.వి.ప్రకాష్ కుమార్) ఒక స్మగ్లింగ్ గ్యాంగులో పని చేసే కుర్రాడు. తప్పుడు మార్గంలో అయినా సరే.. డబ్బులు సంపాదించి ఒక బోటు కొనుక్కోవాలన్నది అతడి లక్ష్యం. ఐతే ఆ స్మగ్లింగ్ గ్యాంగ్ ను నడిపించే థామస్ తో ఒక సందర్భంలో కింగ్ గొడవ పడతాడు. దీంతో తనతో పాటు ఊరి మొత్తానికి పని పోతుంది. ఐతే ఆ ఊరి వాళ్లకు ఉపాధి ఉండదు. ఆ ఊరి నుంచి ఎవరైనా చేపలు పట్టడం కోసం సముద్రంలోకి వెళ్తే శవమై తిరిగొస్తారనే శాపం ఉంటుంది. ఈ శాపం వెనుక రహస్యాన్ని ఛేదించి ఊరికి ఉపాధి కల్పించాలని కింగ్ పంతం పడతాడు. ఓ మిత్ర బృందాన్ని వెంటేసుకుని బోటులో సముద్రంలోకి బయల్దేరతాడు. మరి కింగ్-తన మిత్రులు సముద్రంలోకి వెళ్లి క్షేమంగా బయటికి రాగలిగారా.. ఇంతకీ ఆ శాపం వెనుక కథేంటి.. కింగ్ అనుకున్నది సాధించాడా.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**నటీనటులు:**
జి.వి.ప్రకాష్ కుమార్ నటుడిగా బాగానే తన ముచ్చట తీర్చుకుంటున్నాడు కానీ.. కథల ఎంపికలో చాలా సార్లు తప్పటడుగులే వేస్తున్నాడు. అసలేం అర్థమై అతనీ కథను ఎంచుకున్నాడన్నది అర్థం కాని విషయం. హీరో పాత్ర ఉందంటే ఉంది అనిపిస్తుంది తప్ప దానికి ఏ ప్రత్యేకతా లేదు. నటుడిగా చాలా లిమిటేషన్స్ ఉండడం వల్ల జి.వి. సైతం దాన్ని ప్రత్యేకంగా మార్చలేకపోయాడు. గ్లామర్‌గర్ల్‌గా పేరున్న దివ్యభారతిని ఇలాంటి డీగ్లామర్ పాత్రకు ఎంచుకోవడం రాంగ్ ఛాయిస్. ఇటు ఆమె స్టయిల్లో గ్లామర్ కోణం చూపించలేకపోయింది. అటు నటిగానూ మెప్పించలేకపోయింది. చేతన్.. అళగం పెరుమాళ్ లాంటి సీనియర్ నటులు కొంతమేర ఆకట్టుకున్నారు. హీరో స్నేహితుల పాత్రల్లో చేసిన నటులు పర్వాలేదు. సినిమాలో ఉన్న హడావుడి.. గందరగోళమే.. నటీనటుల హావభావాల్లోనూ కనిపిస్తుంది. అందరూ అవసరానికి మించి నటించారు.

**కథనం-విశ్లేషణ:**

సరికొత్త కథలు.. పకడ్బందీ కథనాలు.. ఆశ్చర్యపరిచే సన్నివేశాలతో ఒకప్పుడు తమిళ సినిమా ఒక స్థాయిలో ఉండేది. వాటిని చూసి మన వాళ్లు ఇలాంటి సినిమాలు తీయరేంటి అనుకునేవాళ్లు మన ప్రేక్షకులు. కానీ ఇప్పుడు రొడ్డకొట్టుడు కథలతో నిండిపోతోంది తమిళ సినిమా. ఏదైనా కొత్తగా ప్రయత్నించినా.. దాన్ని నేర్పుగా చెప్పే నైపుణ్యం కొరవడుతోంది తమిళ ఫిలిం మేకర్లలో. తమిళంలో ఇటీవల వస్తున్న రొటీన్ మాస్ మసాలా సినిమాలతో పోలిస్తే 'కింగ్ స్టన్' కొంచెం భిన్నమైన సినిమానే. సముద్ర నేపథ్యంలో ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించాలని అనుకున్నాడు దర్శకుడు కమల్ ప్రకాష్. కానీ ఆ ప్రయత్నంలో అతను రాసిన కథ గురించి హీరోకు.. నిర్మాతకు ఏం చెప్పి ఒప్పించాడన్నది ప్రశ్నార్థకం. అసలిది హార్రర్ సినిమా అని చెప్పాడా.. థ్రిల్లర్ అన్నాడా.. లేక దీనికి ఇంకేదైనా పేరు పెట్టి వాళ్లకు స్క్రిప్టు చెప్పాడా.. వాళ్లు ఈ కథ మొత్తం విని అసలీ సినిమాతో ఏం చెప్పదలుచుకున్నావని అడిగే ప్రయత్నం చేయలేదా.. కథలో లాజిక్కుల గురించి.. సన్నివేశాల గురించి అసలు సందేహాలే వ్యక్తం చేయలేదా అన్నది ప్రశ్నార్థకం. సినిమా చూసిన వాళ్లను ఈ కథేంటో చెప్పమని అడిగితే..ఒక్క ప్రేక్షకుడైనా ఉన్నదున్నట్లు వివరించగలిగితే.. ఆ వ్యక్తికి పెద్ద సన్మానం చేయాల్సిందే. ఎందుకంటే అంతటి గందరగోళంతో 'కింగ్ స్టన్' సినిమాను నింపేశాడు దర్శకుడు.

అసలు హీరో పాత్ర చిత్రణలోనే దర్శకుడికి సరైన క్లారిటీ లేకపోయింది. ఎలాంటి తప్పయినా చేసి డబ్బు సంపాదించాలన్నది అతడి ప్రాథమిక లక్ష్యం. అతను చేసేది స్మగ్లింగ్. మళ్లీ అందులో మోసాలు చేస్తుంటాడు. అలాంటోడు తన యజమానికి తప్పు చేస్తున్నాడని అతణ్ని ఎదిరించి బయటికి వచ్చి.. ఊరికి సాయం చేయడానికి బయల్దేరతాడు. ప్రతినాయక ఛాయలున్న హీరో పాత్రల్లో తర్వాత పరివర్తన రావడం చాలా సినిమాల్లో చూసి ఉంటాం కానీ.. ఇక్కడ హీరోలో అలాంటి మార్పు రావడానికి బలమైన కారణం కనిపించదు. హీరో అండ్ గ్యాంగ్ చేసే స్మగ్లింగ్ చుట్టూ నడిచే సన్నివేశాల్లో కనీస ఆసక్తి కనిపించదు. ఆ తర్వాత ఊరి కష్టాల చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా తలపోటు తెప్పిస్తాయి. ఐతే 'కింగ్ స్టన్' ట్రైలర్లో ఆసక్తి రేకెత్తించిన సముద్రం నేపథ్యంలో వచ్చే ఎపిసోడ్ కోసం ఎదురు చూడడమే మిగుల్తుంది. తొలి గంటలో చాలా భారంగా సాగే 'కింగ్ స్టన్'.. సముద్రం ఎపిసోడ్ ఆరంభంలో కొంత ఆసక్తి రేకెత్తిస్తుంది. ఊరి వాళ్ల చావుల వెనుక మిస్టరీ ఏంటో చూద్దామని ఆసక్తిగా ఎదురు చూస్తాం. పైకి శాపం అని చెబుతూ.. తెర వెనుక ఇంకేదో కారణం చూపిస్తారని.. సైంటిఫిక్ అప్రోచ్ ఉంటుందని అనుకుంటాం. కానీ ఒక లో లెవెల్ హార్రర్ పాయింట్ తో దీన్ని తేల్చి పడేశారు. ఇక్కడ 'లో లెవల్' అనడానికి కారణం లేకపోలేదు. హీరో అండ్ గ్యాంగ్ మీద దాడి చేసే దయ్యాల అవతారాలు.. వాటి వ్యవహారం చూస్తే ఈ రోజుల్లో ఇలాంటి సెటప్ ఏంట్రా బాబూ అని తలలు పట్టుకోవడమే మిగుల్తుంది. జుగుప్స కలిగించేలా ఉన్న ఆ సీన్లు చూసి తట్టుకోవడం చాలా కష్టం. హీరో తాతకు సంబంధించిన ఫ్లాష్‌బ్యాక్.. అందులో ట్విస్టుల చుట్టూ చాలా కథనే నడిపించారు కానీ.. అది అత్యంత పేలవంగా అనిపిస్తుంది. మినిమం ఇంట్రెస్ట్ కలిగించని విధంగా.. చాలా బోరింగ్ గా ఆ కథ నడుస్తుంది. ఓవైపు అర్థం కాని నరేషన్.. ఇంకోవైపు గుప్పుమనే తమిళ వాసనలు.. ఏమాత్రం పేలని ట్విస్టులతో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ పూర్తిగా తేలిపోయింది. వర్తమానంలోకి వచ్చాక కూడా 'కింగ్ స్టన్'లో ఏ మార్పూ ఉండదు. హీరో ఎవరో.. విలన్ ఎవరో.. ఏ పాత్ర ఏంటో తెలియని అయోమయంతో 'కింగ్ స్టన్' భారంగా సాగుతుంది. సినిమాలో హీరో సహా ఏ పాత్రకూ సరైన ఎలివేషన్ లేదు. ఎలాగోలా సినిమా ముగిసిపోతే చాలనే పరిస్థితి వస్తాం. పతాక సన్నివేశాల్లో కూడా మెరుపులు లేకపోయాయి. సముద్ర నేపథ్యంలో ఒక పెద్ద సినిమాకు అవసరమైన సెటప్ అయితే చేశారు కానీ.. ఏమాత్రం ఆసక్తి రేకెత్తించని కథాకథనాల వల్ల అదంతా వృథా ప్రయాసగా మారింది. రకరకాల జానర్లను మిక్స్ చేసి కథను అల్లిన దర్శకుడు ఏ జానర్ కూ న్యాయం చేయలేకపోయాడు. ఆరంభమైన దగ్గర్నుంచి చివరి వరకు ఒక అలజడితో.. గందరగోళంతో సాగే 'కింగ్ స్టన్' ప్రేక్షకులకు శిరోభారాన్నే మిగులుస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**సాంకేతికవర్గం:** సాంకేతికంగా 'కింగ్ స్టన్'లో చెప్పుకోదగ్గ విశేషం.. పరిమిత బడ్జెట్లోనే సముద్ర నేపథ్యంలో సన్నివేశాలను బాగా తీయగలగడం. ఆర్ట్ వర్క్.. సినిమాటోగ్రఫీ.. అన్నీ బాగా కుదిరి సముద్రంలో వచ్చే సన్నివేశాలన్నీ విజువల్‌గా బాగా అనిపిస్తాయి. ఈ కథ నిజంగా సముద్రంలోనే జరుగుతున్న ఫీలింగ్ కలిగించగలిగారు. జి.వి.ప్రకాష్ కుమార్ పాటల్లో విశేషమేమీ లేదు. నేపథ్య సంగీతం ఓకే. నిర్మాణ విలువలు బడ్జెట్ స్థాయికి చాలా మెరుగ్గానే కనిపిస్తాయి. కమల్ ప్రకాష్ రచయితగా-దర్శకుడిగా.. రెండు రకాలుగా నిరాశపరిచాడు. స్క్రిప్టులో ఉన్న గందరగోళాన్ని టేకింగ్ తోనూ కవర్ చేయలేకపోయాడు. ఆరంభం నుంచి చివరి వరకు సినిమా గోలగోలగా అనిపిస్తుంది. కథను అర్థమయ్యేలా చెప్పడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు.

## రాత్రి సమయంలో పదవ తరగతి విద్యార్థుల ప్రగతి పరిశీలన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొద్దూరు ఉపాధ్యాయులు ఆ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను రాత్రి 8 గంటల సమయంలో వారి ఇంటి వద్ద పరిశీలించి వారి తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు. విద్యార్థులు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని, తరచుగా మంచినీరు తాగాలని ఒత్తిడి లేకుండా చదవాలని గ్రూప్ డిస్కషన్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని, స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయ దామోదర్ రావు హిందీ ఉపాధ్యాయులు పురుషోత్తము పాల్గొన్నారు.



## ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 14న పిఠాపురంలో జరగబోయే జనసేనపార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ విజయోత్సవసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాలనుండి జనసైనికులు, వీరమహిళలు లక్షలమంది హాజరవుతున్న నేపథ్యంలో సభావేదిక కోసం సిమెంట్ కాంక్రిట్ పనులు శరవేగంగా జరుగుతున్న సభా ప్రాంగణాన్ని జనసేన పార్టీ ప్రోగ్రామ్స్ కమిటీ అధ్యక్షులు కళ్యాణం శ్రీనివాసరావుతో పాటు ఆయన సందర్శించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 14న పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని కనీవినీ ఎరుగనిరీతిలో నిర్వహించనున్నామన్నారు. ఘనంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేసి పిఠాపురానికి లక్షల్లో జనసైనికులు, వీరమహిళలు తరలి రావాలని పిలుపునిచ్చారు. జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాయకులు మెట్ట వైకుంఠరావు, గుమ్మడి శాంతారావు, జనసేనపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేదిక గ్రౌండ్ మేనేజ్మెంట్ సభ్యులు, స్థానిక నియో 20జకవర్గ ముఖ్య నాయకులున్నారు.



### తూర్పు మండల బిజెపి అధ్యక్షురాలిగా

## కనుగుల లలిత కుమారి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా, శ్రీకాకుళం నగరం ఈస్ట్ మండల బీజేపీ అధ్యక్షురాలిగా కనుగుల లలిత కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా జిల్లా సంస్థాగత సహ ఎన్నికల అధికారి, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు తెలిపారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు, జిల్లా కోర్ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర సెల్స్, డిపార్టుమెంట్స్ కో-కన్వీనర్ పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అట్టాడ రవిబాబ్జి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధి, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు, దన్నాన మదన్ మోహనరావు, మాజీ మండల అధ్యక్షుడు పూజారి చెల్లయ్య, డా. పైడి సింధూర, కద్దాల శ్యామ సుందర రావు, చింతపల్లి విజయ, బలివాడ వెంకట జాహ్నవి, బి.విజయసారధి, కలగదండు అప్పల సూరి, ఆరంగి సతీష్, తాతారావు, అగతమూడి కిశోర్, చిట్టి తిరుపతి రావు, టంకాల ఝాన్సీ, హనుమంతు ఉమామహేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, గాలి అసిరినాయుడు, నాగరత్నంలు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతో మెలగాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పదోతరగతి పరీక్షలకు ఈనెల 15న హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటిదన్నారు. ఇక్కడ ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చునని సూచించారు. మంచి మార్కులతో ఉత్తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశా లలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, ఎరైజర్స్, స్కేల్స్, హాల్‌టికెట్ పౌచ్‌లు పిల్లలకు అందించారు. ప్రతీ ఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం ఆనవాయితీగా వస్తోందని, అదే మాదిరిగా ఈ ఏడాది కూడా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. ఈ సేవ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.





అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయంలో అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచిన మహిళలను గుర్తించి సన్మానించారు. సన్మానించిన వారిలో కావ్య, శాంతి, పుష్పలత,రమ్య, సౌందర్య, కటారి కమల, కల్లిపల్లి సునీత, కనకమహాలక్ష్మి, అనసూయ, రాధలు ఉన్నారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, డాక్టర్ పైడి సింధూర, డాక్టర్ బాడాన దేవభూషణ రావు , టెక్కం రామ్ గోపాల్, గుత్తు చిన్నారావు, బోగెల ఉమామహేశ్వరరావు, పొడుగు చరణ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న నెక్స్ జెన్ కంప్యూటర్ శిక్షణా సంస్థలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్స్ జెన్ నిర్వాహకులు సీహెచ్ రఘునాధరావు మాట్లాడుతూ పరిశోధనలలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, మహిళా వివక్షత ఉండకూడదని, మహిళలు అందరూ అన్నిరంగాలలో అగ్రగామిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిదరంగాలలో విశిష్టంగా సేవలందిస్తున్న మహిళా డిగ్రీ కాలేజీలో బొటని లెక్చరర్‌గా వున్న చాపా సునీత, ఇండియన్ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఆర్.శ్రావణి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఉషారాణి, వ్యాపారవేత్తలు పసగాడ రమణి, దీపారాణిలను ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు కూడా వారు ఈ స్థాయిలో ఉండటానికి వాళ్ళు ఎదుర్కొన్న ఒడిదుడుకులను విద్యార్థులతో పంచుకున్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఎన్‌సీఎస్‌లో ఉమెన్స్‌డే వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో గల స్థానిక న్యూ సెంట్రల్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవ గొప్పతనాన్ని, మహిళల శక్తి సామర్థ్యాలను వివరించారు. ఇప్పుడు అన్నిరంగాల్లో కూడా మహిళలు ఎంతో ప్రగతి సాధించారని తెలిపారు. ప్రతి ఒక్క మహిళలోను తన తల్లిని, చెల్లిని చూడాలని అలా చూసినప్పుడే మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని విద్యార్థులకు తెలిపారు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయునీలు, మహిళా సిబ్బందికి దుస్సాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ వి సరోజిని, సీనియర్ ఉపాధ్యాయుని రాధాకుమారి పట్నాయక్, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

(సత్యంన్యూస్, పొందూరు)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో పొందూరులో అంబేద్కర్ జంక్షన్ నుండి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మన్నె మణికుమారి మాట్లాడుతూ మహిళలు, పసి పిల్లలపై జరుగుతున్న హింసను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అందరికీ ఉపాధి కల్పించాలని, గౌరవంగా జీవించే అవకాశాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు అన్ని స్థాయిల్లోనూ ఏర్పాటు చేయాలని, లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ,అంగన్వాడీ, స్కీమ్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ధరలను అదుపు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.రామలక్ష్మి, సీహెచ్ రాధమ్మ, లక్ష్మీరత్నం, అనురాధ, అరుణ, సింహాచలం, తమ్మినేని సావిత్రి, రజిని, సీత తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ పథక లక్ష్యాలు ఫుల్..

## వేతన దారులకు వేతనాలు నిల్

(సత్యం న్యూస్ కొత్తూరు)

ఉపాధి హామీ పథకంలో ఇంతకు మునుపు ఉండే పల్లం భూములకు ఇచ్చే పనులు నిలిపేశారు. ప్రస్తుతం చెరువులు, మెట్ట భూములకి మాత్రమే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నారు. ఇంతకుమునుపు వేతనదారులకు పలుగు పారలకు కూడా వేతనాలు వేసేవారు. ఇప్పుడు కేవలం అన్నింటినీ కలిపి రెండు పూటలా పనికి వెళ్లినప్పటికీ రూ.300లు కంటే తక్కువగా వేస్తున్నారని, వేతనదారులు వాపోతున్నారు. ఉపాధి హామీపథకం ద్వారా రైతుల పంట పొలాలకు ఉపాధి హామీ పథకం పల్లపు ప్రాంతంలో పొలాలను అభివృద్ధి చేయడానికి ఉపాధి కల్పించకపోవడం బాధాకరమని రైతులు వాపోతున్నారు. మునుపుటికంటే వేదనదారులు రైతులు ఈ మార్పులు మూలంగా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకంద్వారా చెరువులను రైతు పంట పొలాలను వృద్ధి చేయవలసింది పోయి వెనకనెట్టి వేయబడడం వలన ఉపాధి హామీ లక్ష్యాలకు ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



## ఆడవరంలో మహిళా దినోత్సవం

(సత్యంన్యూస్, గార)

మండలంలోని ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు "అమ్మ నే పలికిన తొలిమాటే అమ్మ" అని పాట పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద గుజ్జల సరస్వతి ముఖ్యఅతిథిగా పాల్గొంటూ విద్యార్థి దశలో ఉంటుండగానే అమ్మ విలువ తెలుసుకోవాలని, అమ్మను కష్టపెట్టరాదని సృష్టిలో అమ్మట్ల తీయనది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జల సరస్వతి, వార్డ్‌మెంబర్ రాములమ్మ, అంగన్వాడీ కార్యకర్త జగదీశ్వరి, ఆయాలు కలమ్మ, శ్రీవాణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థినులు అక్షిత మోల్లగా, దీక్షిత వేగమాంబగ, గగన ఇందిరాగాంధీగా వేషధారణలో ఆకట్టుకున్నారు. అదేవిధంగా జెస్సికా పోలీస్ మహిళ ఆఫీసర్, మేఘన డాక్టర్‌గా, చార్మిల్ క్రికెట్ క్రీడాకారిణిగా, మనస్వి లాయర్‌గా, దాక్షాయిని మహిళగా, యస్మిత రాజకీయ నాయకురాలుగా వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సోనీ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో స్థానిక నివగాం రోడ్లో గల నీలవేణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని త్రాగునీటి చేతిపంపు రిపేర్ అయ్యిందన్న విషయం కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి దృష్టిలోకి వచ్చిన వెంటనే ఈ రోజు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో చేతి పంపు మరమ్మత్తులు దగ్గరుండి చేయించారు. ఈ మరమ్మత్తుల కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావుతోపాటు, కొత్తూరు-3 ఎంపీటీసీ ప్రతినిధి టొంపల తిరుపతి రావు, చోడవరపు గోవింద రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, కొత్తూరు**

## అన్ని రంగాలలో మహిళలు పురోభివృద్ధి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం పట్టణంలోని 80 ఫీట్ రోడ్‌లో 3కే రన్ అండ్ వాక్ కార్యక్రమంలో జీఎన్‌వీ జువెలరీ సంస్థ ఆధ్వర్యంలో ఉమెన్స్ మెగా ఈవెంట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్వాతి శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నారని, పురుషులతో పోటీ పడుతున్నారని, రాబోయే రోజుల్లో మహిళలు సాధించలేనిది అంటూ ఏమీ ఉండదన్నారు. మహిళా దినోత్సవము అంటే మహిళలు విజయం కాదని, మహిళలు సమాజానికి మార్గదర్శికులని నిరూపించడమే ఈ ఉత్సవాలు ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.




### మహిళా సాధికారికతకు

## కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మహిళా సాధికారికతకు కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు తెలిపారు. మహిళలను మహాశక్తిగా, అన్ని రంగాల్లో మహిళా సాధికారతను ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళ సమానత్వం కోసం, సాధికారత కోసం, హక్కుల పరిరక్షణ కోసం ఆది నుంచి కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా రూపుదిద్దించిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో సైతం మహిళా సాధికారత, క్షేమం, భద్రతకు ప్రాముఖ్యమిస్తూ సంబంధిత నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించారని, తెలిపారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001






మహిళా దినోత్సవ సందర్భంగా 80 అడుగుల రోడ్డులోని ఆనంద మయి ఫంక్షన్ హాల్‌లో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కృష్ణాపార్క్ సెక్టార్ తరఫున దూదివారిసందు మెర్జిడ్ సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ఆది లక్ష్మి, బలగ సంధ్యారాణి, ఆయా జానీ, తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



# హిందువులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**- బీజేపీ సీనియర్ నేత పైడి రాజారావు -**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన సంఘటనలో ముస్లింలు హిందువులపై దాడులు చేయడం సరైన సంస్కృతి కాదని, ఈ విషయాన్ని తాను ఖండిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నేత పైడి రాజారావు పేర్కొన్నారు. ఈ ఘటనలో హిందువులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆయన శనివారం ఓ ప్రకటనలో కోరారు. సర్వమత దేశంగా శాంతియుత వాతావరణంలో ముందుకు వెళుతున్న భారతదేశంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. అయితే హిందువులపై దాడులు జరిగితే ఏకపక్షంగా పోలీసులు హిందువులు తప్పు చేశారంటూ కేసులు పెట్టడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలా జరిగడం మరింత బాధను కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాయచోటి సంఘటనలో పోలీసులుపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలా జరగకుండా చూడాలని రాజారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## నారాయణ నర్సింగ్ కళాశాలలో
# మహిళా దినోత్సవం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని భారతీయ జనతా పార్టీ జాతీయ మహిళా మోర్చ ఆదేశాలు, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ సూచనలు మేరకు శ్రీకాకుళం జిల్లా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంగి లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాకుళం నారాయణ నర్సింగ్ కాలేజ్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖపట్నం నుంచి మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు ప్రేమకుమారి, అతిథులుగా శ్రీకాకుళం బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు గొద్దు భాగ్యలక్ష్మి, హాజరయ్యారు. రిమ్స్ హాస్పిటల్ నుంచి ప్రముఖ వైద్యురాలు జోస్నా, జెమ్స్ హాస్పిటల్ నుంచి డాక్టర్ శివ అన్వేష్ (క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్), డాక్టర్ వెంకటరమణ (అంకాలజిస్ట్) పైడి సింధూర (ఈఎన్‌టీ స్పెషలిస్ట్) స్వాతి (యోగా టీచర్), శివ ప్రసాద్ (జెమ్స్ హాస్పిటల్ జోనల్ మేనేజర్), న్యాయవాది పద్మజ మాట్లాడుతూ అవయవ దానం, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యోగా ఆవశ్యకత, వివిధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని చాలా మందికి ఉపాధి కల్పిస్తున్న మహిళలు టేకి ఉమ, పద్మ, కనకమహాలక్ష్మి, సంఘసంస్కర్త సిరిపురపు నాగరత్నంలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు, వివిధ క్షేత్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.



# మహిళల భద్రతకే మొదటి ప్రాధాన్యత

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



సమాజంలోని మహిళలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పరిపూర్ణమైన ప్రగతి సాధించగలమని, మహిళల భద్రత జిల్లా పోలీసు యంత్రాంగం మొదటి ప్రాధాన్యతని ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులకు జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా మహిళా వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. మహిళా పోలీస్ సిబ్బంది, మహిళ పోలీసులకు ఎస్పీ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో బాలికలు, మహిళల భద్రతకు చేపట్టిన చర్యలను పరిశీలించి, భద్రత ప్రమాణాలు దృష్ట్యా మరింత భద్రత పెంచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో సుమారు 230 మహిళా పోలీస్ సిబ్బంది, 500 మంది మహిళ పోలీసులకు జెమ్స్ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మహిళల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి మహిళా బాధితులు, ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను సానుకూలంగా తక్షణమే స్పందించి పరిష్కారం చర్యలు చేపట్టే దిశగా ప్రత్యేక కార్యచరణతో ఉమెన్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. మహిళా సిబ్బంది విధి నిర్వహణలో ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజాభద్రతకు, కుటుంబ సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, పని ఒత్తిడి వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, కావున ఇలాంటి మెడికల్ శిబిరాలు వారి ఆరోగ్య సంరక్షణకు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం, వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న మహిళ పోలీసు సిబ్బంది, మహిళ పోలీసులు, మహిళ హోంగార్డులకుకు ఎస్పీ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సిహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, పైడిపునాయుడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఎస్సైలు హరికృష్ణ జనార్ధన్, రాము, సందీప్, ప్రవల్లిక, లక్ష్మి, మహిళా పోలీసులు, మహిళా పోలీస్ సిబ్బంది, జెమ్స్ హాస్పిటల్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# కత్తికట్టిన వ్యవస్థ ఒంపు తీర్చిన 'సరళ'రేఖ

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రైవేటు బ్యాంకులూ సేఫ్. కానీ బంగారం పోయిందని అప్పటి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉరిటి సరళ కుటుంబం మొత్తం రోడ్డున పడిపోయింది. బంగారం కనపడకుండాపోయిన కేసులో తనను బలిపశువును చేస్తున్నారని, ఇందులో ఆర్ఎం దగ్గర్నుంచి అనేకమంది పాత్ర ఉన్నా, తనను ఇరికించాలని చూస్తున్నారన్న భావనతో స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది. గార బ్రాంచి నుంచి ప్రైవేటు బ్యాంకుల్లో కుదువ పెట్టిన బంగారంలో రూ.కోటి విలువైన తాకట్టు నగలు స్వప్నప్రియ తరఫున విడిపించి ఇస్తే ఎటువంటి కేసూ లేకుండా సెటిల్ చేసుకోవచ్చని అప్పటి ఆర్ఎం టీఆర్ఎం రాజు ఇచ్చిన సూచన మేరకు స్వప్నప్రియ సోదరుడు కోటి రూపాయలు దొరికిన చోటల్లా అప్పు చేసి అప్పటి ఆర్ఎంకు ఇవ్వడం, ఆ మేరకు కొన్ని బంగారు బ్యాగులను విడిపించడంతో ఈ కేసులో ఆయనకు కూడా సంబంధం ఉందంటూ అప్పటి పోలీసులు ప్రాథమికంగా ఎలాంటి విచారణ జరపకుండానే రిమాండ్‌కు పంపారు. ఒకవైపు కూతురు భౌతికంగా లేకపోవడం, కొడుకు రిమాండ్‌లో ఉండటంతో ఉరిటి సరళమ్మకు ఒంటరిపోరాటం తప్పలేదు. ఒకవైపు మీడియాలోను, మరోవైపు సోషల్ మీడియాలోను సరళమ్మ పిల్లలిద్దరూ గార ఎస్‌బీఐ బ్రాంచ్‌ను కొల్లగొట్టేశారని ప్రచారం చేయడంతో బంధువులు, ఆమె సామాజిక వర్గం కనీసం ముఖం చూపించడానికి కూడా ముందుకు రాలేదు. మద్దతిస్తే పోలీసులు తమను కూడా లోపలేస్తారేమోనన్న భావనతో మరికొందరు కనపడకుండాపోయారు. చివరకు బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న స్వప్నప్రియ బ్యాంకు సహచరులు కూడా అసలు ఏం జరిగింది, ఎలా జరిగిందని పరామర్శించడానికి కూడా రాలేదంటే అప్పట్లో పరిస్థితులు ఎలా భయపెట్టాయో అర్థం చేసుకోవచ్చు. స్వప్నప్రియ కేసులో అప్పటి ఆర్ఎం టీఆర్ఎం రాజు ప్రమేయం కూడా ఉందని బయటపడేవరకు కనీసం స్వప్నప్రియ దహన సంస్కార ఖర్చులు కూడా బ్యాంకు నుంచి ఇవ్వడానికి అంగీకరించలేదు. ఇటువంటి సమయంలో రిమాండ్‌లో ఉన్న కొడుక్కు బెయిల్ పెట్టడం, కేసులో తమ ప్రమేయం లేదని నిరూపించుకోవడం, చనిపోయిన కుమార్తె దినకార్యాలు చేయడం, రిమాండ్‌లో ఉన్న కొడుకు భార్య, బిడ్డకు ధైర్యం చెప్పడం వంటి అష్టావధానమే చేసుకొచ్చింది సరళమ్మ. ఇప్పుడు ఖాతాదారుల బంగారం ఖాతాదారులకు చేరింది. ప్రైవేటు బ్యాంకులు నష్టపోయిన బంగారానికి ఇన్సూరెన్స్ క్లెయిమవుతుంది. అసలు ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ నిత్యం కెమెరా గొట్టాల ముందు కనిపించి నేరం మొత్తాన్ని ఒక్కరి మీదకే నెట్టేసిన గారలో ఉన్న రాజకీయ నాయకుడు ఆ తర్వాత టీడీపీని వీడి వైకాపాకు, ఇప్పుడు వైకాపా నుంచి గుండ వర్గానికి షిఫ్ట్ అవుతూ తప్పంతా టీఆర్ఎం రాజుదేనని మీడియాలో మైలేజ్ తెచ్చుకుంటున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో నష్టపోయింది ఉరిటి సరళమ్మే. కుమారుడ్ని ఎలా విడిపించుకోవాలో, బెయిల్ కోసం ఎవర్ని సంప్రదించాలో, ఈ కేసు మూలాలు ఎక్కడున్నాయో, అసలు ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టు అంటే ఏమిటో తెలియని ఒక సాధారణ గృహిణి అప్పట్నుంచి ఇప్పటి వరకు పోరాటం చేస్తునే ఉంది. దాని ఫలితమే ఈ కేసులో అనేక కోణాలు, పోలీసుల కుట్రలు, బ్యాంకు అధికారుల చేతివాటాలు బయటపడ్డాయి. గార బ్రాంచిలో తన కుమార్తె ఉద్యోగం చేస్తుంటే, కుమారుడ్ని ఎందుకు జైలుకు పంపారో అర్థంకాని పరిస్థితి నుంచి ఇప్పుడు ఏ క్షణంలోనైనా అప్పటి సూత్రధారులు, పాత్రధారులు జైలుకు వెళ్లక తప్పదనే స్థాయికి తీసుకువెళ్లిన ఆమె పోరాటపటిమ మహిళా దినోత్సవం సందర్భంగా చెప్పుకోవాల్సిందే. 2024లో ఎప్పుడైతే ప్రభుత్వం మారిందో వెంటనే తమ వద్ద ఉన్న ఆధారాలన్నీ పట్టుకొని ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు ఉరిటి సరళమ్మ ఫిర్యాదు చేశారు. నేరుగా ప్రజాగ్రీవెన్స్‌లో మాజీ స్పీకర్ ప్రతిభాభారతిని కలిసి ఆధారాలు సమర్పించారు. ఈమేరకు ఈ కేసును పునర్విచారించాలని కావలి ప్రతిభాభారతి హోంమినిస్టర్ వంగలపూడి అనితను కోరారు. దీంతో కొత్త ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి మొత్తం డొంకను కదిలించారు. టౌన్ డీఎస్పీ వివేకానంద విడతల వారీగా ఈ కేసులో ప్రమేయం ఉన్న బ్రాంచి మేనేజర్‌ను, ఆడిటర్లను, సూత్రధారులను, అప్పటి ఆర్ఎం రాజుతో పాటు అప్పటి పోలీసు అధికారులను కూడా క్షుణ్ణంగా విచారించారు. చివరకు స్వప్నప్రియ మీద, ఆమె సోదరుడి మీద ఫిర్యాదు చేసిన బ్యాంకు లీగల్ ఆఫీసర్‌ను కూడా తెచ్చి డీఎస్పీ కార్యాలయంలో కూర్చోబెట్టారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు తాను తయారుచేసింది కాదని, తాను పంపిన డ్రాఫ్టింగ్ ఇదేనంటూ ఈ-మెయిల్‌ను లీగల్ ఆఫీసర్ చూపించడంతో స్థానికంగా దాన్ని మార్చేసి ఎఫ్ఐఆర్ కట్టేశారని పోలీసులకు అర్థమైపోయింది. అయితే ఇందులో బంగారం మాయమవడంలో బ్యాంకు అధికారుల పాత్ర ఎంత ఉందో, స్వప్నప్రియ ఆత్మహత్యకు, ఆమె సోదరుడి రిమాండ్‌కు, సరళమ్మ కుటుంబం రోడ్డుపాలవడానికి కారణం అప్పటి పోలీసు అధికారులే. ఈ విషయం కూడా ఇప్పుడున్న ఎస్పీ ఆధ్వర్యంలో నడుస్తున్న విచారణలో తేటతెల్లమైపోయింది. అయితే ఒకసారి పోలీసులు పెట్టిన కేసు తప్పని మళ్లీ అదే పోలీసులు చెప్పలేక, ఈ కేసులో పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించిందని నిర్ధారించలేక సతమతమవుతున్నారు. గార ఎస్‌బీఐ బ్రాంచిలో బంగారం మాయమైందని చెప్పడానికి కొద్ది రోజుల ముందు జరిగిన ఆడిట్, అందులో వచ్చిన క్లీన్‌చిట్, స్వప్నప్రియతో పాటు చెస్ట్‌కు జాయింట్ కస్టోడియన్‌గా ఉన్న ముంజు సురేష్ పేరు ఫిర్యాదులో లేకపోవడం, బంగారం మాయం కేసులో బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టకపోవడం ఈ కేసు నడుస్తున్న క్రమంలోనే ఈ కుంభకోణంలో పాత్ర ఉందని ఏడాది పాటు మరో ఉద్యోగిని మూడో కంటికి తెలియకుండా సస్పెండ్ చేయడం, అదెక్కడా కేస్ డైరీలో పేర్కొనకపోవడం వంటి ఆధారాలు ఓ మామూలు మహిళ సంపాదించి పోరాడటం చిన్న విషయం కాదు. ఇప్పటికే అమరావతిలో ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌లో మూడుసార్లు ఆమె చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్‌ను కలిసి పునర్విచారణ మందకొడిగా సాగుతుందనుకున్న ప్రతీసారి కదలిక తెచ్చి స్థానికంగా విచారణను మాత్రం పూర్తి చేయించుకోగలిగారు. కాలం గడిచినకొద్దీ పరిస్థితుల్లో మార్పు కనిపించింది. ప్రభుత్వం మారినట్టే ఆమె సామాజికవర్గం వారు, బంధువులు కూడా ఇప్పుడిప్పుడే సత్యాన్ని గ్రహిస్తున్నారు. రాకపోకలు సాగిస్తున్నారు. అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. బంగారం పోయిన కేసులో బంగారం లాంటి బిడ్డను కోల్పోయిన, ఆత్మస్థైర్యాన్ని కోల్పోని ఉరిటి సరళమ్మ కోల్పోయిన కూతుర్ని ఇప్పుడెవరిస్తారు? ఆమె కుమారుడు ఈ కేసులో సూత్రధారి అని పడిన నిందను ఎవరు మాపుతారు? ఆయన అనుభవించిన జైలుజీవితానికి ఎవరు పరిహారం చెల్లిస్తారు?

**లోకంలో విజేతల కథలను విరివిగా వినడం ద్వారా ఉత్తేజం కలిగితే అది స్వీయ ప్రేరణకు దారితీస్తుంది. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలకు ఆయుర్దాయం తక్కువ.. అనే అవగాహన ఉంటే బుద్ధి మేలుకుంటుంది. ఇందులో మొదటిది తల్లి కథ అయితే, రెండవది ఆమె కుమార్తె వ్యథ. ఏది ఏమైనా మనిషి నిరాశ లోంచి తేరుకుంటాడు.**

# వాచ్‌మెన్ మృతిపై కేబినెట్ సమావేశమా?

**(సత్యంన్యూస్, పొందూరు)**



వైఎస్ వివేకానంద రెడ్డి ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేసిన రంగయ్య మృతిపై చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో గంటకు పైగా చర్చ జరగడం విడ్డూరమని వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి అన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగయ్య మృతిని వైకాపా మీదకు ఎలా నెట్టాలన్న దానిపై చంద్రబాబు కేబినెట్ సహచరులకు సూచనలిచ్చుంటారని, వాస్తవానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వివేకానందరెడ్డి హత్య జరిగిందని, సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో సీబీఐ విచారణ జరుగుతుంటే చంద్రబాబు ఆత్రం దేనికో అర్థం కావడంలేదన్నారు. రాష్ట్రంలో మరో సమస్య లేనట్లు వృద్ధుడైన రంగయ్య మృతిపై మాట్లాడటం బాధ కలిగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకమంది మహిళల మీద అత్యాచారాలు జరిగాయని, దానిపై మాట్లాడుంటే బాగుండేదన్నారు. కొత్తగా ఒక్క పింఛనుగాని, ఒక ఉద్యోగం గాని ఇవ్వలేదని, వాటిపై మాట్లాడుంటే బాగుండేదన్నారు. రాష్ట్ర అప్పులపై ప్రజలకు వాస్తవం తెలిసిపోయిందని, జగన్ హయాంలో రూ.3.39 లక్షల కోట్లు మాత్రమే అప్పులు ఉన్నాయని స్వయంగా ఆర్థిక శాఖ మంత్రి ఇచ్చిన సమాధానంతో కూటమి ప్రభుత్వానికి నిద్ర పట్టక రంగయ్య మృతిని జాతీయ సమస్యగా మలచడానికి ప్రయత్నిస్తుందన్నారు.

# ట్రిపుల్ ఐటీలో రెండో రోజూ కొనసాగిన టెక్ ఫెస్ట్



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

రాజీవ్ గాంధీ విజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ)లో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2కే25) రెండో రోజైన శనివారం కొనసాగింది. డైరక్టర్ ప్రొఫెసర్ ఆచార్య కొక్కిరాల వెంకటధనబాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన కృష్ణ చౌదరి స్టాల్స్‌ని సందర్శించారు. ఈ టెక్ని వర్స్‌లో ఐఐటి గువహతి, ఐఐటి తిరుపతి, ఐఐటి హైదారాబాద్, ఐఐటి మద్రాస్, ఐఐటి జోధ్పూర్, ఐఐటి భువనేశ్వర్, ఇస్రో నుంచి ఎన్ఐటి నాగపూర్ ప్రొఫెసర్లు లెక్చర్స్ ఏఐ, సెన్సార్, హైడ్రాలజీ, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హై టెంపరేచర్ అల్లాయ్స్, విఎల్ఎస్ఐ, పవర్ ఎలక్ట్రానిక్స్‌పై ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ టెక్నివెర్స్‌లో డిపార్టుమెంటల్ వర్క్ షాప్స్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇలా 50 పైబడి ఈవెంట్స్ జరుగుతున్నాయి. కన్వీనర్ డీన్ వెల్ఫేర్ గేదల రవి, కోకన్వీనర్ సివిల్ విభాగపతి సిహెచ్ తేజ కిరణ్, ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్ వాసు, అకౌంట్స్ ఆఫీసర్ కె.మోహనరావు, డిపార్ట్‌మెంట్ హెచ్ఓడిలు, ఉపాధ్యా యులు, సహోద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.